# అప్పల బతుకులు

ఈరోజు కూడా పాలతను వచ్చే సమయానికే వర్షం పడుతూ వుంది. ఎంత వర్షంలో నైనా ఒక దళసరి ప్లాస్టిక్ కాగితం తలకు చుట్టుకొని సైకిల్ మీద వస్తాడు సమ్మయ్య. మా యింట్లో పాలు పోసిం తర్వాత ఇంకా ముందుకు వెళ్ళి బషీర్‌బాగ్ వరకూ పాలు పోస్తాడు. ఫస్టుపోయి నాలుగు రోజులైంది. సమ్మయ్య రావడంలేదు. ఫస్టు తర్వాత డబ్బు కలెక్షనుం టుంది. అయినా సమ్మయ్య రాలేదంటే నాకాశ్చర్యంగా వుంది. అసలు పదిహేనవ తారీఖు దాటిన దగ్గర్నుంచే సమయ్మయ్య అడ్వాన్స్ అడగడం మొదలుపెట్టాడు. మొన్న ఇరవై ఐదో తారీఖునాడు నన్ను అడ్వాన్స్ అడిగాడు. అది నెలాఖరు. డబ్బుల్లేక మేమే ఇబ్బందులు పడ్తుంటే అతను అడ్వాన్స్ అడిగేసరికి నాకు చిరాకు వేసింది.

"ఎప్పుడూ అడ్వాన్స్ అంటావ్. ఏం చేస్తావ్ డబ్బంతా" కోపంగా అడిగాన్నేను.

సమ్మయ్యకు చుట్ట, సిగరెట్ అలవాటున్నట్లు కన్పించలేదు. సారా తాగే అలవాటు కూడా పెద్దగా వున్నట్లు లేదు. ఎందుకంటే అతను టైమ్ తప్పకుండా రావడమే దానికి నిదర్శనమనిపించింది నాకు. తాగేవాళ్ళు పనికి ఒంగరని నా విశ్వాసం. నా కోపానికి పాపం సమ్మయ్య కాస్సేపు ఏం మాట్లాడకుండా నిలబడ్డాడు తర్వాత మెల్లగా -

"అమ్మా! దానా, చొప్ప, పచ్చగడ్డి మస్తు ధరలయినయి. ఏం జేయాలె. పైసలన్నీ ఆటికే పోతున్నయి. బ్యాంకుల బర్లు కొనేటందుకు తెచ్చిన అప్పు గట్లనేవున్నది. ఈ దందకన్నా ఏ దంద చేసుకున్న బాగుండునమ్మా! అంత దండుగ కష్టం తప్ప ఏం మిగుల్తలేదు" బాధపడుతూ అన్నాడు సమ్మయ్య. ఎప్పుడూ మాట్లాడేటప్పుడు పండ్లు ఇకిలించినట్లుగా అతను పండ్లు ఇకిలించలేదు. కండ్లు చికిలించలేదు. అది చూసి నా మనస్సు కరిగి పోయింది.

"సమ్మయ్యా! ప్రతినెలా అడ్వాన్స్ అడుగుతురటావు. అయినా నెలాఖరున నా దగ్గర మాత్రం ఎక్కడుంటుంది చెప్పు డబ్బు" అన్నాన్నేను. పాలు తీసుకపోయి స్టౌ మీద పెట్టి మంట తగ్గించాను. లేకపోతే పనిలోపడి పాలకింద మంట ఆర్పడం మర్చిపోయి పాలన్నీ ఇంకిపోవడమే గాదు గిన్నెంతా కాలిపోయి మసిబొగ్గులా అయిన సందర్భాలు న్నాయి. బయటికి వరండాలోకి వచ్చాను. ఆరోజు ఇట్లాగే వర్షం. సమ్మయ్య తలుపు బయట వర్షంలో తడుస్తూ నిలబడి వున్నాడు.

"ఇంకా నిలబడే వున్నావా?" ఆశ్చర్యపోయాన్నేను. 'మొండి!' మనస్సులోనే విసుక్కున్నాను.

"లేదమ్మా! బర్లకు పూరాగా దానాలేదు, చొప్పలేదు" అన్నాడు సమ్మయ్య అడ్వాన్సు తప్పదన్నట్లుగా. ఈసారి పండ్లు ఇకిలించాడు. పండ్లన్నీ తోముకోకనోయేమో గారపట్టి వున్నాయి. ఆ పండ్లను చూచి మా బాబు అతనికి -

"సమ్మయ్యా! రోజుకు రెండుసార్లు పేస్టు పెట్టుకొని పండ్లు తోముకో" అని సలహా ఇచ్చాడు.

"బాబూ! మాకెక్కడ్నుంచి వస్తాయి పేస్టులు. బొగ్గుపెట్టి తోముకుంటం. గాని ఓ రాత్రి కాడ లేచి పనిల బడ్తం. ఒకొకసారి పండ్లు తోముకునుడె మర్సిపోత" అన్నాడు సమ్మయ్య పండ్లు ఇకిలించి. మాటమాటకు పండ్లు ఇకిలించడం అతనికి అలవాటు.

అట్లాగే తల మీద ప్లాస్టిక్ కాగితమున్నా ఒళ్లంతా తడిసిపోయి వున్న సమ్మయ్యను చూస్తే నాకు పాపమనిపించింది కాని ఏం చేస్తాను.

"సరే! ఫస్టు తర్వాత పట్టుకునేవే. ఎక్కడికి పోతాయి నీకిస్తే డబ్బులు. కాని ఇప్పుడు నా దగ్గర లేవు" అన్నాన్నేను.

"గట్ల అంటె ఎట్టనమ్మ! ఎట్లయిన రెండొందలు సర్దుబాటు సెయ్యండ్రి. గొడ్లు వానల మాడ్తున్నయి" అన్నాడు సమ్మయ్య.

"ఏమిటి సమ్మయ్యా! ఇంకా నిలబడే వున్నావ్" అంటూ మావారు బెడ్రూంలోంచి వచ్చారు.

"ఏం లేదయ్యా! పాల పైసలు కొంచెం అడ్వాన్స్ అడ్గుతున్న. గంతే!" పండ్లు ఇకిలించాడు సమ్మయ్య.

"పాల డబ్బు గాదు నీళ్ళ డబ్బు అను" నవ్వారు మావారు.

"అట్లంటె ఎట్ల సారూ!" సిగ్గుపడ్తూ తలవంచుకున్నాడు సమ్మయ్య.

"సమ్మయ్యా! అసలు నువ్వు నిజం చెప్పు. పాలల్లో నీళ్ళు కలుపుతావా? నీళ్ళల్లో పాలు కలుపుతావా?" నవ్వుతూ ప్రశ్నించారు మావారు. ఈ ప్రశ్న ఆయన నా పెళ్ళయిందగ్గర నుంచి పాలవాళ్ళను అడుగుతున్నదే.

మావారి ప్రశ్న విని ఏం సమాధానమియ్యకుండా సమ్మయ్య పండ్లు ఇకిలించి నిలబడ్డాడు. అతని గడ్డం కాస్త పెరిగి వుంది. ఎప్పుడూ మాసిన గడ్డంతోనే కన్పిస్తాడు. రోజూ గిల్లెట్ బ్లేడుతో షేవ్ చేసుకోడా సమ్మయ్య - అని మనస్సులో ప్రశ్న పుట్టి నాలో నేనే నవ్వుకున్నాను. అతని బట్టలూ మాసిపోయి, చిరిగిపోయి వుంటాయి. ఒకోసారి భరించలేని చెమటవాసన లేస్తుంటుంది.

"డబ్బంతా ఏం చేస్తాడు సమ్మయ్య!" ఆశ్చర్యమేస్తుంది నాకు.

"ఆ... ఏం చేస్తాడు. పెండ్లాం మెడలో బంగారం దిగేశాడేమో"

"అయినా పొట్టకూడా తినడా! బొక్కలు వెళ్ళి అట్లా వున్నాడేం మనిషి" అనుకుంటుంటాన్నేను.

ఇంకా నిల్చున్న సమ్మయ్య వైపు చూశాను.

"సమ్మయ్యా! వెళ్ళిపో చెప్పాను గదా!" అన్నాన్నేను విసుగ్గా.

"లేదమ్మా! ఎట్లయినా ఇయ్యాలె" అన్నాడు సమ్మయ్య చిరునవ్వుతో.

"సరే ఏదో ఇచ్చి పంపించెయ్యి" అన్నారు మావారు. ఇంటి ఖర్చుకు, కరెంటు బిల్లుకని దాచిపెట్టిన డబ్బులోంచి రెండొందలు తీసి యిచ్చాను సమ్మయ్యకు.

"డబ్బు సరిపోకపోతే కాస్త ఎక్కువ నీళ్ళు పొయ్యి సమ్మయ్యా!" అన్నారు మావారు నవ్వుతూ.

"ఎక్కువ నీళ్ళు పోస్తె గిరాకీ వూరుకుంటర సార్!" పండ్లు ఇకిలించాడు సమ్మయ్య.

"పోతనమ్మా" అని చెప్పి హుషారుగా పోయిన సమ్మయ్య మళ్ళా ఈరోజు వరకు రాలేదు. ఈరోజు కూడా వచ్చే సూచనలు కన్పించడం లేదు. ఆరోజు పట్టుకున్న వర్షం అప్పుడప్పుడాగినా కురుస్తూనే వుంది. ఎంత వాన, తుఫాను, ఎండ వడగాడ్పులైనా వచ్చే సమ్మయ్య ఎందుకు రావడంలేదో నాకర్థం కాలేదు. రోజూ బయటి నుంచి పాల ప్యాకెట్లు తెప్పిస్తున్నాను. రోజూ నగదుయిచ్చి పాలు తెప్పించడం కష్టంగానే వుంది. పది రోజులయినా సమ్మయ్య పత్తాలేడు. నాకెందుకో ఆందోళన ఎక్కువైంది. పిల్లలు స్కూలుకు, మావారు ఆఫీసుకు వెళ్ళిపోయిం తర్వాత ఒకరోజు సమ్మయ్య ఇంటికి బయల్దేరాను. సమ్మయ్య ఒకసారి చెప్పిన అతని ఇంటి జాడలను జ్ఞాపకం తెచ్చుకొని ఆటో అతనికి అడ్రసు చెప్పాను. రామంతపూర్‌లో మెయిన్ రోడ్డు నుంచి కుడిచేతి వేపుగా లోపలికెళ్ళి సందులు గొందులు దాటి చివరికి పోచమ్మ గుడి కెదురుగా వున్న సమ్మయ్య ఇంటికి చేరుకున్నాను. ఇంటి ముందు ప్రహరీ గోడలేం లేవు. రాతిబండలతో ఇంటిచుట్టూ మోకాలెత్తుగా గోడలుగా పేర్చారు. ఆస్బెస్టాస్ రేకులతో కప్పిన ఇల్లు అది. ఇల్లు ఏమిటి ఒక్క గది అది. ఇంటి ముందు, ఇంటి పక్కల ఐదు బర్రెలు కట్టేసి వున్నాయి. అంతా బురదమయం. బర్రెలు తోకాడిస్తూ ఏదో నములుతున్నట్లుగా కనిపించాయి. కాని వాటి ముందేం చొప్ప కనిపించ లేదు. ఇంటి ముందాడుకుంటున్న పిల్లల్ని సమ్మయ్య ఇల్లు ఏదని అడిగితే ఆ యింటివైపే చూపించారు. ఆటో అతనికి డబ్బు ఇచ్చేసి వీలయితే ఆగు, నేను మళ్ళీ వెనక్కి పోతానని చెప్పాను. ఆటో అతను సరే అన్నట్లుగా తలూపాడు. అతనికీ అక్కడ్నుంచి వెళ్ళడానికి ఏ సవారీ దొరకదు ఖాళీగా వెళ్ళే దానికన్నా వేచి వుంటాడులే అనుకొని సమ్మయ్య ఇంటివైపు నడిచాను.

"పాపం సమ్మయ్య ఇంత దూరం నుంచి సైకిల్ తొక్కుకుంటూ వచ్చేవాడన్న మాట!" అనుకున్నాను.

ఎప్పుడైనా ఆలస్యంగా వస్తే "ఏం సమ్మయ్యా! ఏమైంది? ఇంత లేటు. పిల్లలు పాలు తాగకుండానే స్కూలుకెళ్ళిపోయారు. ఇట్లా అయితే ఎట్లా!" అని కోప్పడితే

"సైకిలు పంక్చరయిందమ్మా" అనో "పయ్యే పుల్లలు విరగాయనో, చెయిన్ తెగం దనో" పండ్లు ఇకిలించి చెప్పేవాడు.

"ఏమిటి సమ్మయ్యా! నీ దగ్గర డబ్బు లేదా! ఓ కొత్త సైకిలు కొనుక్కోరాదు!" అన్నాను ఒకసారి.

"కొత్త సైకిలు కొనాలమ్మా!" అన్నాడు సమ్మయ్య.

"డొక్కు సైకిల్ అమ్మేసి స్కూటరు కొనుక్కో. పాల వాళ్ళందరూ స్కూటర్ల మీదే వస్తున్నారిప్పుడు" అన్నాను.

"అమ్మో! స్కూటరే!" భయపడ్డాడు సమ్మయ్య. మళ్ళా వెంటనే - "మీరు డబ్బు అప్పుగా యిస్తే కొనుక్కుంటనమ్మ" అన్నాడు సమయ్య పండ్లు ఇకిలించి, కండ్లు చికిలించి.

"సరే ! సలహా యిచ్చినందుకు నాకే ఎసరు పెడ్తున్నావు, చాలా మంచిగుంది!" అన్నాను.

సమ్మయ్య పండ్లు ఇకిలిస్తూ వెళ్ళిపోయాడు.

మెల్లగా వెళ్ళి ఇంటి ముందు నిలబడి "సమ్మయ్యా!" అని పిలిచాను. ఏం సమాధానం రాలేదు. గది వరకూ వెళ్ళాను. లోపల్నుంచి సన్నని ఏడ్పు విన్పించింది. గది లోపలి కెళ్ళాను. ఇద్దరు పిల్లలు చాపమీద కూర్చొని కన్పించారు. వాళ్ళ పక్కన చిరిగిన పాతబట్టల్లో చంటిపిల్ల వుంది. గది చిన్నది. మెడ తిప్పి చూశాను. పొయ్యి ముందు ఒక యువతి కూర్చొని వుంది. పొయ్యిలో పిడకలు రాజుకుంటున్నాయి. పొయ్యి మీద వంకలు తిరిగిన గిన్నెలో ఏదో ఉడుకుతున్నది. నన్ను చూసి ఆమె ఏడ్పు పెద్దగా చేసింది. గదంతా పేడ వాసన, పిడకల పొగ వాసన.

"ఏమిటమ్మా సమ్మయ్య లేడా?" అడిగాన్నేను.

ఆ యువతి ఏడుపు ఆపలేదు. ఇంతలో బయటి నుంచి ఇద్దరాడవాళ్ళు లోపలికి వచ్చారు.

"ఇంకెక్కడి సమ్మయ్య అమ్మా!" అన్నది వాళ్ళల్లో ఒకామె ఏడ్పు గొంతుతో.

"ఏమైంది!" అడిగాన్నేను. నా నోరు ఎండిపోయింది ఆ మాట వినగానే.

"సమ్మయ్య పది రోజుల కింద ఎలుకల మందు తాగి సచ్చిపోయిండు" అంది ఆమె. ఆ మాటలు పిడుగులాగా విన్పించాయి నాకు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సమ్మయ్య ఆత్మహత్యా ! నేను నమ్మలేకపోయాను.

"ఎట్లా జరిగింది" అడిగాన్నేను.

"శానా రోజులు బర్లకు దానా, చొప్ప లేదని తనుకులాడిండు సమ్మయ్య. గదే రోజు ఎవలో పైసలిచ్చినట్లుంద్రు. చొప్ప కొనుక్కొచ్చిండు. రాత్రయింది. చొప్పను నరికిండు. బర్లకు ఏసిండు. గాని గంతల్నె ఏమనుకున్నడో ఏందో - గంతకు ముందల్నె ఎల్కలకని మందు బిల్లలు తెచ్చిండట. గది దంచుకొని నీళ్ళల్లో పోసుకొని తాగిండు. ఇగో గదే

గిలాసల పోసుకొని తాగిండు'' అని ఆమె అక్కడే పడివున్న సొట్టలు పోయిన రాతెండి గ్లాసువైపు చూపించింది. ''గట్ల ఇసం తాగిండని ఎంటనే తెలుసుకున్న మంచిగుండును. అటెన్కల తెలిసేసరికి మించి పోయింది. దవాఖానాకు ఏసుకపోయినం రిచ్చల. గాని గప్పటికే అంత అయిపోయింది'' చెప్తూ ఆమె పైటకొంగుతో కండ్లు తుడుచుకుంది.

''అగో గామె సమ్మయ్య పెండ్లాం. వీళ్ళు పిల్లలు. చంటిపిల్లలు. రాతంవాళ్ళు ఎవ రెంత పైస ఇయ్యాలె. ఏం అప్పులున్నయి. ఏమీ చెప్పకుండనె ఎల్లిపోయిండు సమ్మయ్య. ఊర్లె సమ్మయ్యకు రెండెకరాల చెలక వుంటె పంట పండక గా ఎవసాయంల పొట్ట ఎల్లక గా భూమి అమ్ముకొని పొట్ట చేతబట్టుకొని పట్నం వచ్చిండు పాపం! భూమి అమ్మిన పైసలకు తోడుగా బ్యాంకుల అప్పు తీసుకుండు. గీ ఐదు బర్రెలను కొనుక్కున్నడు. ఓ రాత్రి లేచి అన్ని పనులు తానే ఒక్కడు చేసుకునెటోడు. ఎవర్నైన జీతానికి సుత పెట్టుకోలేదు. ఎల్లదని పాపం! బాగా కష్టం చేసుకునెటోడు. గింత కష్టం చేసిన పనిల లాభం లేకుండ పోయింది. అప్పులు ఎట్ల తీరుతయని మనస్సుల రంధి పెట్టుకున్నడేమొ. గందుకె గింత పని చేసిండు. బతికున్నోల్లకు అన్నాలం చేసి పోయిండు. ఊర్ల చేసిన కట్టం రాసికి రాకనే భూమి అమ్ముకొని పట్నం చేరిండు. పాపం! పట్నంల మాత్రం ఏం బాగుపడ్డడు. బ్యాంకు అప్పులు చేసిండు. గా అయ్యను గా అమ్మనడిగి అప్పులు చేసిండు. దాంతోటి గుండె దైర్నం చెడిపోయింది. మందు దాగి ఎల్లిపోయిండు. తన కట్టాలేందో పరాయివాల్లకు గింత ఎరుక కానియ్యలేదు బిడ్డ! గిప్పుడు గీ పెండ్లాం పిల్లల్ను దిక్కు లేని పచ్చులను చేసి పోయిండు. గీ వీల్లను ఆదుకునెటోల్లు ఎవరో సమఝయిత లేదు. వీల్ల గాచారం గట్లున్నది'' అని ఆమె చెప్తుంటే ఆమె కళ్ళ వెంట కన్నీళ్ళ ధారలు కారాయి. కండ్లు తుడుచుకోవాలన్న ధ్యాస కూడా లేదామెకు.

నేను సమ్మయ్య భార్య వైపు చూశాను. ఆగకుండా ఏడుస్తూ వుందామె. మాట్లాడే స్థితిలో లేదు. ఆమెను ఎట్లా ఊరడించాలో నాకర్థం కాలేదు.

ముగ్గురు పిల్లలు, అప్పులు, ఎట్లా యీ సంసారాన్ని ఈదుతుందో? అని గుండె చలించింది నాకు. మళ్ళా ఒకసారి వచ్చి సమ్మయ్య భార్యను కలుద్దామనుకొని నేను నిస్సహాయంగా బయటికి కదులుతూ గదంతా కలయజూశాను.

ఆ గదిలో రెండు మూడు రాతెండి గిన్నెలు, రెండు తలెలు, చిన్న స్టీలు గిలాసులు కన్పించాయి. తాడుతో కట్టిన దండెం మీద పాతబడి దుమ్ముకొట్టుకపోయిన ఓ ప్యాంటు, షర్టు,చినిగి పేగులైన ఓ రెండు చీరెలు, జాకెట్లు వున్నాయి. ''ఇదేనా సమ్మయ్య సంసారం! ప్రతి నెలా సమ్మయ్య వేలల్లో సంపాదిస్తున్నాడనుకున్నాన్నేను. పాపం! అంతా అప్పులకే పోయేదేమో. పైగా బర్రెలదానా, గడ్డి, చొప్ప అని ఖర్చులు ! అంతా పోగా అతనికి మిగిలేది ఏం లేదన్నమాట. అయినా సమ్మయ్య కండ్లు చికిలించి, పండ్లు ఇకిలించి ఏం చెప్పుకునే వాడు కాదు – ఆ ఆలోచనలతో నా గుండె బరువెక్కింది. గబగబ బయటికొచ్చి ఆటో ఎక్కేశాను.

– ప్రజాశక్తి, 17-12-2000